క్లుప్తంగా

నేడు, రేపు ఉచిత వైద్య శిబిరాలు

ఆరిలోవ: చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయ ఆవరణలో ఈ నెల 7, 8 తేదీలలో ఉచిత వైద్య శిబిరాలు జరగనున్నాయి. గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎన్టీఆర్ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సేవా స్ఫూర్తి వ్యవస్థాపకుడు ఒమ్మి అప్పలరాజు తెలిపారు. మహా శివరాత్రి సందర్భంగా శుక్రవారం మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టీ వానపల్లి అప్పారావు తెలిపారు. రక్తపోటు, ఈసీజీ, పాప్స్మియర్ పరీక్షలను మెడికవర్ వైద్యులు ఉచితంగా చేస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అంగన్‌వాడీ సెంటర్‌కు ఫ్యాన్ వితరణ



ఫ్యాన్ అందిస్తున్న కళింగ, కోమటి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

ఎంవీపీ కాలనీ: జాలరిపేటలో ఓ అంగన్‌వాడీ సెంటర్‌కు కళింగ, కోమటి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫ్యాన్ బహూకరించారు. ఈ మేరకు అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం సెంటర్‌కు చేరుకొని ఐసీడీఎస్ అర్బన్ సీడీపీవో రమణకుమారి చేతుల మీదుగా ఈ ఫ్యాన్‌ను సెంటర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా రమణకుమారి మాట్లాడుతూ చిన్నారుల భవిష్యత్ కోసం దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

భూవివాదాల డ్రైవ్‌కు 9 ఫిర్యాదులు

ఎంవీపీ కాలనీ: భూవివాదాలకు సంబంధించి నగర పోలీసు యంత్రాంగం చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో 9 ఫిర్యాదులు అందాయి. ఎంవీపీ పోలీసు స్టేషన్‌కు ఆరు ఫిర్యాదులు వచ్చాయి. ద్వారకా ఏసీపీ రాంబాబు ఆధ్వర్యంలో ఈ ఫిర్యాదులను పర్యవేక్షించారు. ఆయా అంశాలపై రెవెన్యూ అధికారుల వివరణ కోసం లేఖలు రాయనున్నట్లు తెలిసింది. ఎంవీపీ సీఐ సంజీవరావు, తదితరులు పాల్గొన్నారు.

మూడో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో..

బీచ్‌రోడ్డు: నగర సీపీ ఆదేశాల మేరకు బుధవారం మూడో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన స్పందనకు మూడు ఫిర్యాదులు వచ్చాయి. ఈ ఫిర్యాదులను ఏసీపీ స్పెషల్ బ్రాంచి ఎం.శ్రీనివాసరావు ఫిర్యాదుదారుల నుంచి స్వీకరించారు.

ఘోషాస్పత్రి ఏవోగా నారాయణరావు



నారాయణరావును అభినందిస్తున్న సిబ్బంది

మహారాణిపేట : ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి (ఘోష) పరిపాలనాధికారిగా నారాయణరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పరిపాలనాధికారిగా పని చేసిన సన్యాసినాయుడు ఈ ఏడాది జనవరి 31న పదవీ విరమణ చేశారు. ఖాళీగా ఉన్న ఆ పోస్టులో డీఎంహెచ్‌వో కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న నారాయణరావును పదోన్నతిపై విక్టోరియా ఆస్పత్రి పరిపాలనాధికారిగా నియమించారు. గెజిటెడ్ హోదా రావడంతో నారాయణరావును వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ సిబ్బంది, ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి కార్యాలయ సిబ్బంది అభినందించి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం సూపరింటెండెంట్ (ఇన్‌చార్జి)గా సీనియర్ అసిస్టెంట్ దుర్గాప్రసాద్‌ను నియమించారు. ఆయన కూడా బాధ్యతలు స్వీకరించారు.

జగనన్న విద్యా దీవెన..
భవితకు భరోసా

- జీవీఎంసీ జోన్–3లో పరిధిలో 4,735 మందికి లబ్ధి
- విద్యార్థులకు పూర్తయిన 5వ విడత నిధుల పంపిణీ
- ప్రభుత్వ సాయంపై సర్వత్రా ఆనందోత్సాహం



అర్హత జాబితాను పరిశీలిస్తున్న విద్యార్థినులు (ఫైల్)



విద్యాదీవెన చెక్కులు అందజేస్తున్న సోషల్ వెల్ఫేర్ డీడీ రామారావు తదితరులు

ఎంవీపీ కాలనీ: ఉన్నత లక్ష్యాలు దిశగా విద్యార్థులను నడిపించాలనే కాంక్షతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న విద్యాదీవెన సత్ఫలితాలనిస్తోంది. విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థిక ఇబ్బందులు అడ్డురాకూడదనే ఉద్దేశంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అందుబాటులోకి తేగా.. దానికి కొనసాగింపుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఆ పథకానికి మరిన్ని మెరుగులు దిద్ది జగనన్న విద్యా దీవెన, జగన్న వసతి దీవెనగా అమలు చేస్తోంది. ఈ పథకం కింద ఎంతో మంది విద్యార్థులు ఉన్నత విద్య కల సాకారం చేసుకుని బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకుంటున్నారు.

ఇదీ పథకం లక్ష్యం

ఆర్థిక సమస్యల కారణంగా విద్యార్థులు చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన పథకాలను అందుబాటులోకి తెచ్చింది. ఈ పథకాల ద్వారా ఇంటర్మీడియెట్ మినహా, ఐటీఐ, పాలిటెక్నికల్, డిగ్రీ, ఆపై స్థాయి కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారు. గతంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు కళాశాలలు, విద్యార్థి ఉంటున్న హాస్టల్ యాజమాన్యాల ఖాతాలో ప్రభుత్వం జమ చేసేది. వైఎస్ జగన్ సర్కారు ఆ నిబంధనలు సవరించి నిధులను నేరుగా విద్యార్థి, తల్లిదండ్రుల ఖాతాకు మార్చింది. దీంతో విద్యార్థుల ఉన్నత చదువు సాకారానికి ఈ నిధులు పక్కాగా వినియోగంలోకి వచ్చాయి. మూడు కేటగిరీలుగా ఈ నిధులు అందిస్తున్నారు. ఐటీఐ విద్యార్థులకు ఏడాదికి రూ.10 వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15 వేలు, డిగ్రీ, ఆపైస్థాయి విద్యార్థులకు రూ.20 వేలు చొప్పున ప్రభుత్వం అందిస్తోంది. ఇంజినీరింగ్ విద్యార్థులకు ఆయా కాలేజీల ఫీజులను బట్టి ప్రభుత్వం నిధులు విడుదల చేస్తోంది. ఏటా రెండు దఫాలుగా నిధులు మంజూరు చేస్తోంది.

జోన్–3 పరిధిలో అర్హులు 4,735

జోన్–3 పరిధిలో జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన కింద 4,735 మంది విద్యార్థులు లబ్ధి పొందారు. వీరికి 5వ విడతగా జగనన్న ప్రభుత్వం విద్యా దీవెనగా రూ.3.95 కోట్లు నిధులను ఇటీవల మంజూరు చేసింది. జోన్–3 పరిధిలో అత్యధికంగా 22వ వార్డులో 472 మంది విద్యార్థులు, 16వ వార్డులో 403 మంది విద్యార్థులు ఉన్నారు. 20వ వార్డులో అత్యల్పంగా 250 మంది విద్యార్థులు అర్హత కలిగి ఉన్నారు.



సద్వినియోగం చేసుకుంటున్నాం..

జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన పథకాలను పూర్తిస్థాయిలో వినియోగించుకుంటున్నాం. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో వేల మంది ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఈ పథకమే మూలాధారం. నిధుల మంజూరులో రాష్ట్ర ప్రభుత్వం మంచి చొరవ చూపిస్తుంది. దీంతో స్వేచ్ఛగా ఉన్నత విద్యను అభ్యసించగలుగుతున్నాం.

– శ్యామ్, ఏయూ విద్యార్థి

భవిష్యత్‌కు సువర్ణ అవకాశం

జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెనల ద్వారా విద్యార్థులు వారి ఉన్నత విద్య కలను సాకారం చేసుకునే సువర్ణ అవకాశం లభిస్తోంది. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో ఏటా లక్షల మంది విద్యార్థులు ఉన్నత విద్యావంతులు అవుతున్నారు. వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకుంటున్నారు. గతంలో ఆర్థిక ఇబ్బందులు కారణంగా ఎంతో ఉంది పేద విద్యార్థులు ఆసక్తి ఉన్న ఉన్నత విద్యకు దూరంగా ఉండే వారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు.

– సాగర్, విద్యార్థి, ఎంవీపీ కాలనీ

శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు



కాశీవిశ్వేశ్వర స్వామి

ఏయూ క్యాంపస్ : పెదవాల్తేరు అసంగానంద ఆశ్రమంలో ఈ నెల 8న శ్రీమృత్యుంజయేశ్వర ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆశ్రమ ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శివరాత్రి రోజున గంగ, గోదావరి, కృష్ణా, వంశధార, నాగావళి నదుల నుంచి తెచ్చిన పవిత్ర జలాలతో స్వామికి అభిషేకం నిర్వహిస్తామన్నారు. ఉదయం 5 గంటలకు పంచామృత అభిషేకాలు చేస్తామని చెప్పారు. సాయంత్రం పుర వీధుల్లో ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, సాయంత్రం భక్తులతో పంచ నదీ జలాలతో అభిషేకం, రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలంలో ప్రత్యేక అభిషేక వస్త్రం, సహస్రనామార్చన, రుద్రాభిషేకం జరుపుతామన్నారు. మార్చి 30, 31 తేదీలలో 49వ వార్షికోత్సవాల వేడుకలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. శ్రీకాళహస్తి, రాయపూర్‌కి చెందిన స్వాములు పాల్గొంటారన్నారు. తమ ఆలయంలో ఎటువంటి రుసుములు చెల్లించాల్సిన అవసరం లేదని, భక్తులే స్వయంగా వచ్చి అభిషేకం చేసుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు విశ్వేశ్వరరావు, కార్యదర్శి ఎం.అప్పారావు, రెడ్డి, ట్రస్టీలు కె.నారాయణమ్మ, జి.చిన్నా పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో..

స్థానిక లాసన్స్‌బే కాలనీలో ఉన్న శ్రీకాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరిచుకుని కాశీ విశ్వేస్వర స్వామి ఆలయంలో ఏకవార అభిషేకాలు, మహాన్యాస రుద్రాభిషేకాలు జరుపుతామన్నారు. అభిషేకాలు చేయించుకునేవారు ఆలయంలో రూ.116 చెల్లించి రశీదు పొందాలని సూచించారు.

శివాలయంలో అన్నసమారాధన



భక్తులకు అన్న ప్రసాదం వడ్డిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు పెదగదిలిలో శివాలయం వార్షికోత్సవం రెండు రోజులుగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలు, మామిడి తోరణాలతో అలంకరించారు. ప్రతి రోజు ఉదయం నుంచి భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు, అభిషేకాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆలయ నిర్వాహకులు బుధవారం మధ్యాహ్నం భక్తులు కోసం అన్నసమారాధన చేపట్టారు. పెదగదిలి, చినగదిలి కొండవాలు ప్రాంతాల వాసులు తరలివచ్చి స్వామి ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ, వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి.. స్వామిని దర్శించుకున్నారు. అనంతరం అన్నసమారాధనలో పాల్గొని భక్తులకు ప్రసాదం వడ్డించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గొలగాని శ్రీనివాస్, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ సర్జరీ వైద్య శిబిరానికి విశేష స్పందన

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో బుధవారం నిర్వహించిన ప్లాస్టిక్ సర్జరీ ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓపీ బ్లాక్‌లో కొనసాగింది. గ్రహణం మొర్రి, డయాబెటిక్ ఫుట్, పురుషులలో రొమ్ము గ్రంధి పెరుగుదల, బోదకాలు, కిలాయిడ్ చికిత్సలు, కాలిన గాయాలు, విరిగిన చేతులు, కాళ్లు, వాస్కులర్ సమస్యలు తదితర వ్యాధులతో బాధపడుతున్నవారు ఇక్కడ సేవలు పొందారు. అలాంటి వారికి శిబిరంలో 42 మందికి ప్లాస్టిక్ సర్జరీ విభాగం వైద్య సిబ్బంది సేవలు అందించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు మాట్లాడుతూ ఈ శిబిరానికి వచ్చినవారిలో అవసరమైన 35 మందికి కలర్ డాప్లర్ పరీక్షలు ఉచితంగా చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విమ్స్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏయూ సమాచారం

పారిశ్రామికవేత్తలుగా ఎదగండి

ఏయూ క్యాంపస్: యువతరం ఆశయం దిశగా అడుగులు వేయాలని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి అన్నారు. బుధవారం ఉదయం ఏయూ టీఎల్ఎన్ సభా మందిరంలో నిర్వహించిన జియోఫిజిక్స్ విభాగం వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. విశ్వవిద్యాలయంలో ప్రతి విద్యార్థి ప్రతిభావంతుడేనన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా యువతరం ఎదగాలని పిలుపునిచ్చారు. ఏయూలో స్టార్టప్ ఇంక్యుబేషన్ వ్యవస్థలను అభివృద్ధి చేశామని, వీటిలో 152 సంస్థలు పనిచేస్తూ 7 వేల మందికిపైగా ఉపాధి కల్పించాయన్నారు. ఈ కార్యక్రమంలో గీతం విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ కె.శ్రీకృష్ణ, విభాగాధిపతి ఆచార్య సి.వి.నాయుడు, ఆచార్య పి.రాజేంద్రప్రసాద్, నన్నయ వర్సిటీ వీసీ ఆచార్య ఎం.జగన్నాథరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యతోనే మహిళా సాధికారత



సదస్సును ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్స్

ఏయూ క్యాంపస్: ఉన్నత విద్యతో మహిళా సాధికారత సాకారం అవుతుందని ఏయూ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మి అన్నారు. ఏయూ దుర్గాబాయి దేశముఖ్ మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌ని వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో బుధవారం ఉదయం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆచార్య విజయలక్ష్మి మాట్లాడుతూ ఓ మహిళ విద్యావంతురాలైతే ఆ కుటుంబం మొత్తం విద్యావంతులుగా మారుతారన్నారు. లీ ఫార్మా నిర్వాహకురాలు లీలారాణి మాట్లాడుతూ మహిళలకు విద్య చాలా అవసరమన్నారు. స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ సుధా పద్మశ్రీ మాట్లాడుతూ చదువుపై నిరుత్సాహం చూపవద్దని సూచించారు. డీఎస్ఎన్ఎల్‌యూ ఆచార్య నందినీ మాట్లాడుతూ యువత వివాహం విషయంలో ఆచితూచి వ్యవహరించాలని, ఉన్నత విద్య, వ్యక్తిత్వం ఉన్న వ్యక్తిని వివాహం చేసుకోవాలన్నారు ఈ. కార్యక్రమంలో ఏయూ ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు, ఓఎస్డీ వి.కృష్ణమోహన్, దుర్గాబాయి దేశముఖ్ మహిళా అధ్యయన కేంద్రం సంచాలకురాలు ఆచార్య పల్లవి, క్రీడా విభాగ సంచాలకుడు ఆచార్య ఎస్.విజయ్ మోహన్, డాక్టర్ పి.ఉష, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాలలో భాగంగా సాయంత్రం ఏయూ బాస్కెట్ బాల్ మైదానంలో విద్యార్థులు ఫ్లాష్‌మాబ్ నిర్వహించి అలరించారు.

విజయవంతంగా యూత్ ఫెస్ట్ నిర్వహణ



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: యూత్‌ఫెస్ట్ నిర్వహణతో ఏయూ సత్తాను చాటారని, భవిష్యత్తులో ఆల్ ఇండియా యూనివర్సిటీ యూత్ ఫెస్ట్‌ని నిర్వహిస్తామని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తెలిపారు. ఏయూలో జనవరిలో నిర్వహించిన యువభేరీ సౌత్ జోన్ యూత్ ఫెస్ట్ విజయోత్సవాన్ని టీఎల్ఎన్ సభామందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ యువభేరి విజయవంతం కావడంలో ఏయూ విద్యార్థి వలంటీర్ల కృషి నిరుపమానమన్నారు. ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాలు, వసతి, భోజనం వంటివి ఏర్పాట్లు చేసిన ఆచార్య ఎస్.విజయమోహన్ బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు, ఆచార్య పల్లవి, దర్శకులు మహేంద్ర చక్రవర్తి, ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ, విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు, డీన్ ఆచార్య కె.బసవయ్య, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఏకాదశి ఆర్జిత సేవలు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ తులసీ దళార్చన వైభవంగా నిర్వహించారు. 108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

- మేయర్ గొలగాని, ఎంపీ ఎంవీవీ
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ



12వ వార్డులో కంచె వేయడానికి శంకుస్థాపన చేస్తున్న మేయర్ గొలగాని, ఎంపీ ఎంవీవీ

బీచ్ రోడ్డు: రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేస్తున్నారని మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. బుధవారం జీవీఎంసీ 15వ వార్డులోని మద్దిలపాలెంలో రూ.58.10 లక్షల జీవీఎంసీ నిధులతో తలపెట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనులను నాణ్యతతో శరవేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, గిరిబాబు, ఏఈ రహీం, తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవలో..

ఆరిలోవ: జీవీఎంసీ 10, 12 వార్డుల్లో బుధవారం పలు అభివృద్ధి పనులకు ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి శంకుస్థాపన చేశారు. జీవీఎంసీ 10వ వార్డు తోటగరువు, బీఎస్ఆర్ నగర్‌లో గెడ్డల ఆధునికీకరణ, కమ్యూనిటీ టాయిలెట్స్ నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. రూ.1.91 కోట్ల నిధులతో ఈ పనులు చేపడుతున్నట్లు మేయర్, ఎంపీ తెలిపారు. 12వ వార్డు శ్రీకాంత్‌నగర్‌లో ఆంజనేయస్వామి గుడి ఎదురుగా గెడ్డ అంచున ఇనుప తీగలతో కంచె నిర్మాణం , న్యూశాంతినగర్ కొండవాలులో రక్షణ గోడ నిర్మాణం కోసం కూడా కార్పొరేటర్ అక్కరమాని రోహిణితో కలిసి వారు శంకుస్థాపన చేశారు. ఇందు కోసం రూ.31.39 లక్షల ఖర్చు చేస్తున్నారు. ఈ కార్యక్రమాలలో జీవీఎంసీ ఏఈ వెంకటరావు, సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

16వ వార్డులో..

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 16వ వార్డు అంబేడ్కర్ నగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు బుధవారం ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. రూ.38 లక్షల ఎంపీ నిధులతో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణం పనులకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, అప్పారావు, జీవీఎంసీ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆత్మీయ సత్కారం



విమలారెడ్డిని సత్కరిస్తున్న ప్రీతం లూక్స్

ఏయూ క్యాంపస్: నగరంలోని గురజాడ కళాక్షేత్రం వేదికగా బుధవారం జరిగిన విశాఖపట్నం జిల్లా సేవకుల సదస్సులో పాల్గొన్న దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి సోదరి వైఎస్ విమలారెడ్డిని సెయింట్ లూక్స్ విద్యా సంస్థల నిర్వాహకులు ప్రీతం లూక్స్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ జాన్ వెస్లీ, తదితరులు పాల్గొన్నారు.

మహిళల స్వయం సాధికారతే లక్ష్యం



మాట్లాడుతున్న రమణకుమారి

ఎంవీపీ కాలనీ: ఐసీడీఎస్ అర్బన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం జాలరిపేటలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ విశాఖ అర్బన్ సీడీపీవో ఎంవీ రమణకుమారి ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ స్వయం సాధికారత దిశగా మహిళలు అడుగులు వేయాల్సిన అవసరముందన్నారు. రాజ్యాంగం మహిళలు, పురుషులకు సమానంగా హక్కులు కల్పించిందన్నారు. ఆయా హక్కులపై మహిళలకు అవగాహన అవసరమన్నారు. ఆయా హక్కులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ ఉన్నత చదువులు దిశగా ముందుకు సాగాలన్నారు. బాల్య వివాహాలకు మహిళలు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విన్నీషా, జాలరిపేటలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి దేవాలయంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసీదళార్చన నిర్వహించనున్నారు. భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి.

ఏవీఎన్ కళాశాలకు 'మాకెన' సోదరుల చేయూత



అదీప్ భానోజీరావుకు చెక్కు అందజేస్తున్న మాకెన సోదరులు

దాబాగార్డెన్స్ : ఏవీఎన్ కళాశాలలో తరగతి గదుల పునరుద్ధరణకు పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చారు. 164 ఏళ్ల చరిత్ర గల ఏవీఎన్ కళాశాలలో కొన్ని తరగతి గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటిని పునరుద్ధరించేందుకు కళాశాల యాజమాన్యం పూర్వ విద్యార్థుల సహకారం కోరింది. యాజమాన్యం పిలుపును అందుకున్న కళాశాల పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చారు. పూర్వ విద్యార్థుల సంఘం మాజీ అధ్యక్షుడు, రిటైర్డ్ జడ్జి మాకెన శ్రీనివాసరావు, ఆయన సోదరుడు మాకెన సీతారామపాత్రుడు రూ.3 లక్షల విరాళాన్ని ప్రకటించారు. దీనిలో భాగంగా రూ.లక్ష విరాళాన్ని కళాశాల వైస్ చైర్మన్, కరస్పాండెంట్ ఏవీ అదీప్ భానోజీరావుకు బుధవారం అందజేశారు. కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు, పూర్వ విద్యార్థుల సంఘం కార్యవర్గ సభ్యులు త్యాగరాజు, నాగేశ్వరరావు, ఐటీ డెవలపర్ శ్రీనివాస్ పాల్గొన్నారు. కళాశాలలో ఐదు తరగతి గదుల పునరుద్ధరణకు ఇంజినీరింగ్ విభాగం రూ.18 లక్షలు అంచనా వేసిందని, ఒక్కో తరగతి గదికి కనీసం మూడు లక్షలు ఖర్చవుతుందన్నారు. ఈ క్రమంలో మాకెన సోదరులు మూడు లక్షలు ఇచ్చేందుకు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు.